ప్రజాశక్తి
శనివారం 29 జూన్ 2024
5
పార్వతీపురం మన్యం

## 1న జాబ్ మేళా

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసిలో జూలై 1న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిఎంఆర్ ఆర్‌ఎక్స్ ఏ సంయుక్తంగా ఈ జాబ్ మేళా నివసిస్తున్నట్లు తెలిపారు సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగాలకు నెలకు రూ.14వేలు నుంచి రూ.18 వేల వరకు వేతనం లభిస్తుందన్నారు. 8 నుండి 12 గంటల వరకు పనిచేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పదో తరగతి లేదా డిగ్రీ చదివి ఉండాలన్నారు. 19 ఏళ్ల నుంచి 30 ఏళ్లు గలవారు ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జులై 1న ఒరిజినల్ ధ్రువపత్రాలతో వైటీసీకి రావాలని కోరారు. మరిన్ని వివరాలకు 93929 17696 , 95730 43507 సంప్రదించాలని కోరారు.

# తోటపల్లి నీరు విడుదల

## రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : మంత్రి

సాగునీటిని విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే జగదీశ్వరి, జయకృష్ణ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు నీటిని ఖరీఫ్‌కు శుక్రవారం ఆమె విడుదల చేశారు. తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ వద్ద జరిగిన కార్యక్రమం లో పాలకొండ, కురుపాం ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి సమక్షంలో మంత్రి నీటిని విడుదల చేశారు. కుడి ప్రధాన కాలువ ద్వారా ప్రాజెక్టు కింద మొత్తం 1,31,221 ఎకరాల ఆయకట్టుకు నీరంద నుంది. కుడి ప్రధాన కాలువ కింద సీతా నగరం, బలిజిపేట మండలాల్లో 27 గ్రామాలకు చెందిన 13,684 ఎకరాలకు సాగునీరందుతుండగా, విజయనగరం జిల్లా లోని బొబ్బిలి, చీపురుపల్లి, నెల్లిమర్ల, రాజాం నియోజక వర్గాలలోని 13 మండలాల్లో 66 గ్రామాలకు చెందిన 25,060 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాలో ఎచ్చెర్ల నియోజకవర్గంలో జి.సిగడాం, లావేరు, రణస్థలం మండలాల్లో 105 గ్రామాలకు చెందిన 38,975 ఎకరాలకు సాగునీరందు తుంది. 1,31,221 ఎకరాల్లో 84,033 ఎకరాలు స్థిరీకరణ, 47,188 ఎకరాలు కొత్త ఆయకట్టుగా ఉంది. అనంతరం మంత్రి సంధ్యా రాణి మాట్లాడుతూ పూడికలు, తుప్పలు తొలగించి శివారు భూములకు సైతం నీరందించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తోటపల్లి ప్రాజెక్ట్‌ను ప్రారంభించి శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాలను సస్యశ్యామలం చేశారని తెలిపారు. తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టులు, పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఆమె చెప్పారు. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ రైతులు పంటలు వేసేందుకు భూములను సిద్ధం చేయాలన్నారు. ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడు తూ శివారు భూములకు నీరు చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్, ఉత్తర కోస్తా జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు, ఎస్ఇ రాజరాజేశ్వరి, ఇఇలు జి.రామచంద్ర రావు, ఆర్.అప్పల నాయుడు, డిఇ శ్రీహరి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరందించాలి

గరుగుబిల్లి, జియమ్మ వలస మండలాల్లో సుమారు 10 గ్రామాలకు చెందిన 8వేల ఎకరాలకు మూడు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరందించాలని మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు, నాయకులు డొంకాడ రామకృష్ణ అంబటి రాంబాబు కోరారు. తోటపల్లి ప్రాజెక్టు నుంచి కుడికాలువ నీటిని విడుదల చేసేందుకు వచ్చిన మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే టి.జగదీశ్వరికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు ఎత్తిపోతల పథకాల ద్వారా 2019న అప్పటి ప్రభుత్వం జిఒ 164 విడుదల చేసిందన్నారు. ఈ జిఒను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని వివరించారు. జల వనరులు శాఖ నుంచి అన్ని అనుమతులతో వచ్చిన జిఒను మళ్లీ పునరుద్ధరించి తమ ప్రాంతాలకు సాగునీరివ్వాలని కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

# నిధుల్లేకుండా మరుగుదొడ్ల మరమ్మతులెలా?

## మంత్రి ఆదేశాలు అమలు ప్రశ్నార్థకమే
## నేడు మున్సిపల్ సమావేశానికి సంధ్యారాణి

మరమ్మతులకు గురైన సామాజిక మరుగుదొడ్లు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో నిరుపయోగంగా ఉన్న సామాజిక మరుగుదొడ్లను మరమ్మతులు చేసి వెంటనే వినియోగంలోకి తేవాలన్న రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి ఆదేశాల అమలు ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. అసలు నిధుల్లేని పరిస్థితిలో ఉన్న మున్సిపాలిటీలో సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులు ఎలా చేయాలని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వాస్తవంగా పట్టణంలోని 28 సామాజిక మరుగుదొడ్లు గత కొంతకాలంగా నిరుపయోగంగా వున్నాయి. పట్టణంలోని మురికివాడలకు సమీపంలో సామాజిక మరుగుదొడ్లు నిర్మించారు. ఇవి పూర్తిగా మరమ్మతులకు గురి కావడంతో ప్రజలు వినియోగించే పరిస్థితి లేదు. దాదాపు అన్ని మరుగుదొడ్లకు తలుపులు ఛిద్రమయ్యాయి. కొన్నింటికి నీటి సౌకర్యం లేదు. వీటన్నింటికీ మరమ్మతులు చేయడానికి అంచనాలు వేసి పనులు చేపట్టాలని మంత్రి సంధ్యారాణి కమిషనర్ ప్రసన్నవాణిని ఆదేశించారు. వారం రోజుల్లో పనులు ప్రారంభం కావాలని హుకుం జారీ చేశారు. కానీ మున్సిపాలిటీలో సాధారణ నిధిలో డబ్బులు లేవు. మున్సిపాలిటీలకు రెండు రకాల సాధారణ నిధులు వుంటాయి. 001 ఖాతాలో వున్న నిధులు మున్సిపల్ కార్యాలయంతో పాటు పారిశుధ్య, ఇంజనీరింగ్, తాగునీటి సరఫరా విభాగాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలకు మాత్రమే వినియోగించాలి. 001 ఖాతాలో ఆస్తిపన్ను ద్వారా వసూళ్లు జమవుతాయి. 002 ఖాతాలో నీటి పన్ను, వినోదపు పన్ను, ప్రకటనల పన్నులకు సంబంధించిన నిధులు జమవుతాయి. వీటిని పారిశుధ్యం, తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులకు వినియోగించాల్సి వుంది. అయితే 002 ఖాతాలో సుమారు రూ.రెండు లక్షల వరకు మాత్రమే వున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులు ఎలా చేయగలమని అధికారులు గుసగుసలాడు కుంటున్నారు. పట్టణంలోని 28 చోట్ల ఉన్న సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులకు సుమారు రూ.20లక్షలు అవసరమని ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు కౌన్సిల్ ఆమోదం కోసం అజెండాలో పొందుపర్చారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన సాధారణ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి మంత్రి సంధ్యారాణి కూడా హాజరుకానున్నారు.

**మంత్రి దృష్టి సారిస్తే**

మంత్రి సంధ్యారాణి పట్టణంలోని సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తే తప్ప పనులు జరిగే అవకాశం లేదు. జిల్లా కలెక్టర్‌ను అడిగో, ప్రభుత్వం నుంచో రూ.20లక్షల నిధులు తీసుకొస్తే త్వరితగతిన పనులు జరిగే అవకాశాలు ఉన్నాయి. లేకపోతే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా సామాజిక మరుగుదొడ్లు మిగిలిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

**టెండర్లు పిలిచినా జరగని పనులు**

పట్టణంలో వివిధ గ్రాంట్లకు సంబంధించిన నిధులతో పనులు చేపట్టడానికి గతంలో అనేకసార్లు టెండర్లు పిలిచారు. 14,15 ఆర్థిక సంఘాలకు సంబంధించిన నిధులతో పనులు చేపట్టడానికి అనేకసార్లు టెండర్లు పిలిచారు. కానీ టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. కొన్ని పనులకు శంకుస్థాపన చేసినా ప్రారంభం కాలేదు. ఈ విధంగా మున్సిపాలిటీలో వివిధ గ్రాంట్లకు సంబంధించిన నిధులు సుమారు రూ.7కోట్ల వరకు మూలుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు బిల్లులు సకాలంలో మంజూరు కావడం లేదనే అనుమానంతో కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకొచ్చే అవకాశం లేదు. నిధుల్లేవని స్పష్టంగా తెలిసిన తర్వాత పనులు త్వరితగతిన ఎలా చేయగలమనే ప్రశ్న తలెత్తుతోంది.

రోడ్డు మరమ్మతులకు కొలతలు వేస్తున్న ఆర్‌అండ్‌బి అధికారులు

# రోడ్డు మరమ్మతులకు పరిశీలన

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి కూనేరు వరకు గల అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన భారీ గోతులను మరమ్మతులు చేసేందుకు ఎట్టకేలకు ఆర్‌అండ్‌బి అధికారులు పరిశీలించారు. శుక్రవారం కోటిపాం, గుమడ, కొమరాడ, చోళపదం తదితర ప్రాంతాల్లో రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులను మరమ్మతులు చేసేందుకు ఆర్‌అండ్‌బి ఇఇ వేణుగోపాలరావు, డిఇ అప్పాజీ ఆధ్వర్యంలో గోతులను పరిశీలించారు. రోడ్డు మరమ్మతులకు ఎంత మేరకు నిధులు అవసరం అన్న నివేదికలను సిద్ధం చేస్తున్నట్లు వారు తెలిపారు. రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులను పరిశీలించి నిధులు మంజూరుకు నివేదికలు ఉన్నతాధికారులకు పంపిస్తామని అధికారులు తెలిపారు. ఈ పరిశీలనలో ఆర్‌అండ్‌బి జెఇ రాజేంద్ర, సిబ్బంది ఉన్నారు.

**తాత్కాలికంగా గోతులు కప్పాలి.. సిపిఎం**

అధికారులు అంతర రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులు కప్పేందుకు నివేదికలు సిద్ధం చేయడం మంచి పరిణామమని సిపిఎం నాయకులు సాంబమూర్తి అన్నారు. రోడ్డు పరిశీలనకు వచ్చిన అధికారులతో ఆయన మాట్లాడారు. రోడ్డు గోతులు కప్పేందుకు ప్రభుత్వానికి నిధులు కోసం నివేదికలు పంపించినప్పటికీ ప్రస్తుతం వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా గోతులు కప్పేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రహదారిపై భారీ గోతులు ఏర్పడి అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. తక్షణమే అధికారులు ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరయ్యే సమయం ఆలస్యం కావచ్చు కాబట్టి తక్షణమే అధికారులు, ప్రభుత్వం స్పందించి ప్రస్తుతానికి రోడ్డుపై ఏర్పడిన గోతులను కప్పి ప్రమాదాలను నివారించాలని కోరారు.

మూసి ఉన్న డాక్టర్ గది ; ఫార్మసీ గది వద్ద వేచి ఉన్న రోగులు

# నాడి చూసే నాథుడే కరువు!

## సెలవులో ఒకరు... శిక్షణకు మరొకరు ●రోగులకు తప్పని పాట్లు

ప్రజాశక్తి - మక్కువ

గత రెండు రోజులుగా ఆసుపత్రికి వచ్చే రోగులకు నాడి చూసే నాథుడే కరువయ్యాడు. జిల్లా ఉన్నతాధికారుల వైఖరి వల్ల మండలంలోని శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ప్రజలకు అవస్థలు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యాధికారులు వారికున్న అవసరాల నిమిత్తం బయటకు వెళ్లగా, వారి స్థానంలో ఎవరినైనా తాత్కాలికంగా నియమించి వైద్య సేవలు అందించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ఉన్నతాధికారులు ఎవరూ చర్యలు చేపట్టడంలేదు. దీంతో గిరిజన ప్రాంత ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఎంత ఉదాసీనత ఉందో ఇట్టే అర్ధమవుతుంది. సుమారు పది కిలోమీటర్ల దూరానున్న నంద పంచాయతీ గిరిజనులు వైద్యం కోసం ఇక్కడకు వచ్చారు. అయితే వైద్యుల్లేకపోవడంతో వైద్యమందక నిరాశతో వెనుతిరుగుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా వరకు గిరిజన ప్రాంతాల ప్రజలకు అందుబాటులో లేకుండా ఓ మూలకు విసిరేసినట్లు ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొంతకాలంగా ఇక్కడ పని చేసే సిబ్బంది విధులకు డుమ్మా కొడుతున్నా జిల్లా అధికారులకు మాత్రం పట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎవరు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో ఎక్కడ ఎఫ్‌ఆర్‌ఎస్ వేస్తున్నారు వారికే తెలియదని ఉద్యోగుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోజువారీ తీసుకోవాల్సిన అటెండెన్స్ నమోదు కూడా వారానికి 10 రోజులకు తీసుకుంటూ రావడం ఇక్కడ పరిపాటిగా మారిందన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది పరిస్థితిపై సమీక్షించి గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందేలా కృషి చేయాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

# ఫ్లైఓవర్ నిర్మించండి

## కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఎంపి కలిశెట్టి వినతి

కేంద్రమంత్రి ఓఎస్‌డికి వినతిని అందజేస్తున్న ఎంపి అప్పలనాయుడు

ప్రజాశక్తి-కొమరాడ

పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఒడిశా లోని రాయగడ, కోరాపుట్ జిల్లాలకు వెళ్లే అంతర్ రాష్ట్ర రోడ్డు మార్గంలో పార్వతీపురం-కొమరాడ గ్రామాల మధ్య ఫ్లై ఓవరు బ్రిడ్జిలు నిర్మించాలని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ను విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈమేరకు శుక్రవారం కేంద్రమంత్రి సెలవులో ఉండడంతో ఆయన ఓఎస్‌డి వేద ప్రకాష్‌కు వినతి అందజేశారు. పార్వతీపురం-కొమరాడ గ్రామాల మధ్య రాయగడ రైల్వే లైన్ ఉందని, ఇటీవల థర్డ్‌లైన్ కూడాపూర్తయ్యిందని తెలిపారు. కొమరాడ మండలం అర్తాం, కోటిపాం గ్రామాల మధ్య దూరం ఐదు కిలోమీటర్ల పరిధిలో 3రైల్ క్రాసింగ్‌లు ఉన్నాయని, ప్రస్తుతం మూడో లైన్ వచ్చిన తరువాత ప్రతీ ఐదు నిముషాలకు గేటు పడుతూనే ఉందని, దీంతో ఈ మార్గంలో ప్రయాణం తీవ్ర ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. .విశాఖ పోర్టు నుంచి ఒడిశా లోని దమంజోడి, రాయగడ, తదితర ప్రాంతాల పరిశ్రమలకు అల్యూమినియం తదితర ముడిసరుకు లారీల్లో వెళ్తున్నందున ఒక వైపు ప్రయాణికులు, మరోవైపు రవాణా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మన్యం, విజయనగరం, ఒడిశా రాయగడ, కోరాపుట్ జిల్లాల రోగులకు చెందిన అంబులెన్సులు ఈ మార్గం గుండా వస్తుంటాయని, గేట్లు పడి సమయానికి ఆసుపత్రికి చేరుకోలేక ప్రాణాపాయానికి గురవుతున్నారని తెలిపారు. . మూడు రైల్ క్రాసింగ్‌ల అడ్డు తొలగేందుకు ఒక్క దగ్గర ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు.

# ఐటిఐ రెండో విడత కౌన్సిలింగ్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి ఆర్‌ఐటిఐలో రెండో విడత కౌన్సిలింగ్ కోసం ఈనెల 29 నుంచి జులై 24 వరకు ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్.సునీల్ కుమార్ తెలిపారు. పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు iti.ap.gov.in ఆన్లైన్లోలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. జూలై 25 లోపు దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఐటిఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. జులై 27 ఉదయం 10 గంటలకు నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

# అన్న క్యాంటీన్ స్థలాన్ని పరిశీలించిన మంత్రి

ప్రజాశక్తి-సాలూరు

నియోజకవర్గ కేంద్రంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు భంజ్ దేవ్ శుక్రవారం పరిశీలించారు. మండల తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలం లో అన్న క్యాంటీన్ ఏర్పాటు కు ప్రతిపాదన చేస్తున్నారు. మూసివేసి వున్న సబ్ జైలుకు ఎదురుగా వున్న స్థలం లో ఏర్పాటు చేస్తే పేదలకు అందుబాటులో వుంటుందని మంత్రి సంధ్యారాణి, భంజ్ దేవ్ భావిస్తున్నారు. మహిళా మార్ట్ ముందు నుంచి దారి కూడా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు మూడు పూటలా భోజనం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ సింహాచలం, ఇంఛార్జి కమిషనర్ శ్రీరామ్మూర్తి, టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి

# సమిష్టిగా అభివృద్ధి పథంలో నడిపిద్దాం

## మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే విజయచంద్ర

మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

సమిష్టిగా పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కౌన్సిలర్లు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యేగా గెలుపొంది మొట్టమొదటిసారిగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఆయన్ను మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, కార్యాలయంలోని పలు విభాగాలు అధికారులతో కలిసి సాదరంగా ఆహ్వానించి పుష్పగుచ్ఛాలను అందించి దుశ్శాలువతో సత్కరించి, అభినందనలు తెలిపారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరానికి వెళ్లిన ఎమ్మెల్యే చైర్‌పర్సన్ తో పాటు వైసిపి కౌన్సిలర్లకు అభినందనలు తెలిపారు. చైర్‌పర్సన్ కుర్చీ పక్కనే ఎమ్మెల్యేకు మరో కుర్చీ వేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పలు మున్సిపాల్టీల్లో చైర్‌పర్సన్ పక్కనే ఎమ్మెల్యేలు, మంత్రులు, కూర్చోవడం ఎక్కడ చూడలేదని, ఇటువంటి కొత్త సాంప్రదాయానికి గత పాలకులు తెరలేపారని, అలాంటి సాంప్రదాయం తమకు వద్దని కౌన్సిల్ సభ్యులచే ఎన్నుకోబడిన చైర్‌పర్సన్ కు మాత్రమే సమావేశాన్ని నడిపించడం జరుగుతుందని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పట్టణ ప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి మంచి మెజార్టీ ఇచ్చారని, వారి ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు తీర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపి పట్టణ ప్రజల రుణం తీర్చుకుంటాననివిజయ్ చంద్ర అన్నారు. పోడియం దిగువన ఎమ్మెల్యేకు కుర్చీ ఏర్పాటు చేశారు. అక్కడ నుంచే ఆయన మాట్లాడుతూ, రాజకీయాలకతీతంగా పట్టణ అభివృద్ధి అందరి లక్ష్యం కావాలని అన్నారు. ఏ అభివృద్ధి పని అవసరమైనా తనను సంప్రదించవచ్చని, ప్రజల సమస్యలే ముఖ్యం తప్ప రాజకీయాలు కాదని వివరించారు. అజెండాలో పొందుపరిచిన 14 అంశాలను అధికారులు చదివి వినిపించారు. జీరో అవర్‌లో 14వ వార్డు కౌన్సిల్ సభ్యులు ద్వారపు రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ 30 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ బాగాలేదని, దీనిపై దష్టి పెట్టాలని కోరారు. టిడ్కో ఇళ్ల గురించి లబ్ధిదారులు డబ్బులు చెల్లించారని, ఆ డబ్బులను తిరిగి ప్రభుత్వం చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ఆ ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తామని, ఇళ్లు రాని లబ్ధిదారులకు డబ్బులు తిరిగి ఇచ్చేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే జగనన్న లే అవుట్‌లో అక్రమాలు జరిగాయని, వాటిపై కమిటీని వేసి నిజమైన లబ్ధిదారులకు ఇంటి స్థలాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్యాలయంలో 27 మందికి ఔట్సోర్సింగ్ ఉద్యోగాలు వేశారని, వారు ఎవరో, ఎక్కడెక్కడ ఉద్యోగాలు చేస్తున్నారు తెలియపర్చాలని కోరారు. తమ వార్డులో ఉన్న శ్మశానాన్ని అభివృద్ధి చేయాలని గతంలో కోరగా ఇంతవరకు అభివృద్ధి పనులు చేపట్టడం లేదని తెలిపారు. పదో వార్డు వైసిపి కౌన్సిల్ సభ్యులు జె.దివ్య మాట్లాడుతూ తమ వార్డులో పారిశుధ్య సక్రమంగా లేదని,కాలువలు నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యే ఎంతో సమయస్ఫూర్తితో సమాధానాలు ఇస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సమావేశంలో వైస్ చైర్ పర్సన్లు కొండపల్లి రుక్మిణి, ఇందుపూరు గున్నేష్ , ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పలువురు కౌన్సిలర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### కౌన్సిల్ సమావేశంలో తెలుగు తమ్ముళ్ల కోలాహలం

స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తెలుగు తమ్ముళ్లు కోలాహలం చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం మొదటిసారి జరిగిన మున్సిపల్ పాలకవర్గ సాధారణ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర హాజరయ్యారు. ఆయన వెంట వచ్చిన టిడిపి నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ ఆవరణలో ఎమ్మెల్యే విజయ్ చంద్ర నాయకత్వం వర్ధిల్లాలంటూ పెద్ద ఎత్తున బార్నాల సీతారాం నాయకత్వంలో నినాదాలు చేశారు. పార్వతీపురం మున్సిపాలిటీ అభివృద్ధి విజయ చంద్రకే సాధ్యమని, మున్సిపాలిటీలో టిడిపి విజయకేతనం ఎగరవేసి పట్టణా అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామని తెలుగు తమ్ముళ్లు ప్రతిజ్ఞ చేశారు.

## ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

# ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

**ఎంట్రీలు పంపాల్సిన చిరునామా**

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

## ఆహార పదార్థాల తయారీకి అనుమతులు తప్పనిసరి

**ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్**

జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకులు, హోటల్, మిఠాయి తయారీదారులంతా విధిగా అనుమతులు కలిగి ఉండాలని ఆహార నియంత్రణాధికారి ఎస్.ఈశ్వరి తెలిపారు. లైసెన్స్ లేకుంటే ఆహార భద్రతా చట్టం 2006ను అనుసరించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా లో మిఠాయి దుకాణాలు, హోటల్ లలో తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు. ఆహార పదార్థాలకు లైసెన్స్ లేనిచో రూ.5లక్షలు జరిమానా, లేదా ఆరు నెలల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. పరిశుభ్రత పాటించని మిఠాయి దుకాణాలు, హోటళ్ల నిర్వాహకుల ఆహార భద్రత లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

## ఘనంగా బేటీ బచావో... బేటీ పడావో

**ప్రజాశక్తి - కొమరాడ**

బాలికలను రక్షిద్దాం... బాలికలను చదివిద్దాం అన్న ఉద్దేశంతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సిడిపిఒ సుగుణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఘనంగా బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం విక్రంపురం, కోటిపాం, కొమరాడ, గుణానపురం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు శారద, లక్ష్మి, అరుణ మాట్లాడుతూ విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ బాలల హక్కులు, చట్టాలు, బాల్యవివాహాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి, రాజేశ్వరి, హెల్పర్లు సిబ్బంది ఉన్నారు.

మొక్కలు నాటుతున్న విద్యార్థులు

## మొక్కలు నాటిన ఐటిఐ విద్యార్థులు

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణానికి ప్రాధాన్యత ఇవ్వాలని భద్రగిరి ఆర్‌ఐటిఐ ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ కోరారు. ఐటిఐ ఆవరణంలో విద్యార్థులతో కలిసి మామిడి, పనసమొక్కలను నాటారు. రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యంతో మనిషి కొత్త కొత్త వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. పర్యావరణం లేకుంటే భవిష్యత్తులో మనిషి మనుగడ ప్రమాదకరంగా ఉంటుందన్నారు. దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని, పర్యావరణంతోనే ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన

**ప్రజాశక్తి - సీతానగరం**

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక ఎంఇఒ-2 కె.ఈశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న నిధులను విద్యార్థులకు పోష్టికాహారంతో అందించాలని, విద్యార్థుల ఆరోగ్యపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎ.ఎంఎల్‌ఎస్ ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన భాస్కర్ కాలేజ్ డైరెక్టర్

**ప్రజాశక్తి- పార్వతీపురం**

స్థానిక భాస్కర్ జూనియర్ కళాశాల డైరెక్టర్ బొంత శ్రీనివాసరావు కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీ విద్యా విధానంలో ఉండే సమస్యలను మంత్రి దృష్టిలో పెట్టామన్నారు. దీనికి మంత్రి స్పందిస్తూ విద్యాపరమైన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ కళాశాల ఎగ్జిక్యూటివ్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు జ్ఞాపికను అందజేస్తున్న శ్రీనివాసరావు

## పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

**ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్**

పట్టణ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు వార్డు సచివాలయాల శానిటరీ సెక్రటరీలు, హెల్త్ సెక్రటరీలు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. శుక్రవారం మున్సిపల్, వైద్యశాఖల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్టాప్ డయేరియా కార్యక్రమంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో డ్రైన్ డిసిల్టింగ్ డ్రైవ్ పనులతో పాటు యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ పూర్తిస్థాయిలో జరిగేలా సంబంధిత సెక్రటరీలు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రతి రోజు ఎమినిటి సెక్రటరీలు తాగునీరు సరఫరా సమయంలో క్లోరినేషన్ పరీక్షలు చేయాలని, పైప్ లైన్ లీకులను గుర్తించి తక్షణమే మరమ్మతులు ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డిఇ, శానిటరీ ఇన్స్పెక్టర్, ఎఎస్ఓ,ఎమినిటి, హెల్త్, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రెటరీ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో రక్తనిధి ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి - సాలూరు**

ఏజెన్సీలో నిరుపేద గిరిజన రోగులు అత్యవసర పరిస్థితుల్లో రక్తం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, స్థానిక ఏరియా ఆసుపత్రిలో రక్తనిధి ఏర్పాటు చేయాలని మానవతామూర్తి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.గోపాలరావు కోరారు. శుక్రవారం ఆయన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. విజయనగరం, విశాఖపట్నం ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేసిన గిరిజన రోగులకు అవసరమైన రక్తం లేక ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. కావున స్థానిక ఏరియా ఆసుపత్రిలో రక్తనిధి ఏర్పాటు చేయాలని గోపాలరావు కోరారు. దీనిపై మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ ఈ సమస్యలు తన దృష్టికి వచ్చాయని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రతినిధులు సూర్య యాదవ్ ఉన్నారు.

## మిగులు సీట్లకు కౌన్సిలింగ్

**ప్రజాశక్తి - సీతంపేట**

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల కారిగోడ మినీ గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు శుక్రవారం డిడి కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్నదొర ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో ప్రవేశాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో మినీ గురుకులం ప్రిన్సిపల్ హేమలత, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చెరువును తలపిస్తున్న మార్కెట్ రోడ్డు

**ప్రజాశక్తి - సీతానగరం**

వర్షం పడితే చాలు స్థానిక మార్కెట్ రోడ్డు చెరువును తలపిస్తుంది. దీంతో వ్యాపారులు, ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈరోడ్డుపై నీరు నిల్వ ఉండడంతో ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యపై గత ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా కొత్త ఎమ్మెల్యే ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బురద, గోతులమయమైన సీతానగరం మార్కెట్ రోడ్డు

# టిడ్కో ఇళ్లు అందజేస్తాం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్**

టిడ్కో లబ్ధిదారులకు త్వరలోనే ఇళ్లను అందజేస్తామని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. అడ్డాపుశిల వద్ద నిర్మాణంలో ఉన్న టిడ్కో సముదాయాలను శుక్రవారం పరిశీలించారు. సంబంధిత ఎఇతో పనులు జరుగుతున్న పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల పేరుతో జగనన్న ఎంతో దోచుకున్నారని విజయ్ చంద్ర ఆరోపించారు. టిడిపి హయాంలో టిడ్కో గృహాలు మంజూరయ్యాయని, వైసిపి పాలనలో చేసిందేమీ లేకపోయినా అప్పటికే రంగులు వేసి హంగామా చేశారని విమర్శించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాలు మంజూరు చేసిన లబ్ధిదారులలో కొందరు ప్రస్తుతం ఇక్కడ లేరని వారిని తప్పించి వైసిపి నాయకులు ఇష్టారాజ్యంగా కొంతమందికి మంజూరు చేసి అసలైన పేదలకు అన్యాయం చేశారని విమర్శించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి అసలైన పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు బార్నాల సీతారాం, కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు గుండ్రెడ్డి రవికుమార్, కోలా మధు, టిడిపి, జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయచంద్రకు వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు

# అంగన్వాడీల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

**ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్**

అంగన్వాడీలకు వేతనాల పెంపు, గ్రాట్యూటీ అమలు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు తదితర సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంటా జ్యోతి కోరారు. ఈ మేరకు ఆమె యూనియన్ నాయకులతో కలిసి శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిని అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పేద గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్స్, మినీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నా తమకు పనిభారం పెరిగిందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదని, వేతనాల పెంపు, గ్రాట్యూటీ అమలు తదితర సమస్యల కోసం గత ప్రభుత్వం ఆధ్వర్యంలో 42 రోజుల పాటు తీవ్ర నిర్బంధాన్ని ఎస్మాలాంటి చట్టాలను ఎదిరించి సుదీర్ఘ సమ్మె చేశామని అన్నారు. అనివార్యంగా ప్రభుత్వం కొన్ని జిఒలు ఇచ్చినా ప్రధాన సమస్యలు పరిష్కరించలేదన్నారు. గత ప్రభుత్వం జులైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ కాపీ ఇచ్చారు. కావున అంగన్వాడీ సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ అంగన్వాడీల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిని అందజేసిన వారిలో యూనియన్ పార్వతీపురం ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు గౌరిమణి, అలివేలు, బలిజిపేట ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు దాలమ్మ, సత్యవతి, సెక్టార్ లీడర్లు స్వర్ణ, సావిత్రి, సునీత, స్వర్ణలత, రాజేశ్వరి, గౌరి, నీలవేణి పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలి

**ప్రజాశక్తి - పాచిపెంట**

ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని, జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కుడుమూరు- మెట్టవలస జంక్షన్ వద్ద శుక్రవారం గిరిజనులు కరపత్రం విడుదల చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం మండల సహాయ కార్యదర్శి కొర్ర కల్యాణ్, ఉపాధ్యక్షులు సుకురు ఎర్రయ్య మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులకు గత ప్రభుత్వం చేసిన అన్యాయం ప్రస్తుతం కొత్త ప్రభుత్వం చేయొద్దన్నారు. ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు జీవో 3కు చట్టబద్ధత కల్పిస్తూ ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలు చేస్తారని ఎంతో ఆశతో ఆదివాసీ నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా తీవ్రం అన్యాయం చేసిందని ఈ ప్రభుత్వమైనా జిఒ 3కు చట్ట బద్ధత కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కొర్ర అర్జున్, శివ, సోను గిన్నెల పోతయ్య, గోపాల్ సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తూ, నిరసన తెలుపుతున్న గిరిజనులు

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ నాగేశ్వరరావు

# డయేరియా ప్రబలకుండా ముందు జాగ్రత్తలు

**ప్రజాశక్తి - కురుపాం**

గ్రామాల్లో డయేరియా బారిన ప్రజలు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్లదేనని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కె.నాగేశ్వరరావు అన్నారు . శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో గల వెలుగు కార్యాలయం వద్ద ఐదు మండలాల ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు గ్రామాల్లో డయేరియా ప్రబలకుండ ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గామీణ నీటి సరఫరా పారిశుధ్య కమిటీలను బలోపేతం చేయాలన్నారు. నీటి సరఫరా చేసే ట్యాంకులను శుభ్రపర్చి బ్లీచింగ్ క్లోరినేషన్ చేయించి పరిశుభ్రమైన నీటిని ప్రజలకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో ప్రతి ఇంటి వద్ద ప్రజలు వేడి చేసే నీటిని తాగేలా అవగాహన కల్పించాలన్నారు. అప్పుడే ప్రజలు డయేరియా బారిన పడకుండా రక్షించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో డిపిఎంయు సిబ్బంది ఆర్.లక్ష్మణ్, ఎం.రాఘవరావు, జి.విజయబాబు, బి.సుజాత, ఐదు మండలాల ఎఇలు అర్. వేణుగోపాల్, ఎ.నవీన్, వై.భరత్, జి.గౌరీశంకర్, ఎన్.ప్రవీన్, ల్యాబ్ పర్సన్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# సంతృప్తినిచ్చిన ఉపాధ్యాయ వృత్తి

## ప్రధానోపాధ్యాయులు మరడాన శివున్నాయుడు

**ప్రజాశక్తి- సీతానగరం**

ఉపాధ్యాయ నాయకునిగా, స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ప్రజా సేవలు, కన్న పిల్లల వలె విద్యార్థులకు బోధనలు అందించే ఉపాధ్యాయ వృత్తి ఎంతో సంతృప్తినిచ్చిందని మండలంలోని నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరడాన శివున్నాయుడు అన్నారు. ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ఆయన విధుల్లో ఎదుర్కొన్న తీపి అనుభవాలను 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే...

మాది సీతానగరం మండలం నిడగల్లు. 1962 జులై 1న మరడాన రామినాయుడు, ఎరుకులమ్మ దంపతుల మొదటి సంతానం. ప్రాథమిక, హైస్కూల్ విద్య స్వగ్రామంలోనే కొనసాగింది. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాను. శ్రీకాకుళం జిల్లా వమ్మరవల్లిలో టీచర్ ట్రైనింగ్ పూర్తయింది. 1983 డిసెంబర్ 19న సీతానగరం మండలం అంటిపేట ఎంపిపి స్కూల్‌లో సెకండ్ గ్రేడ్ టీచరుగా నా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. ఇక్కడ కొన్ని నెలలు మాత్రమే పనిచేసి 1984లో స్వగ్రామమైన నిడగల్లు తాను చదువుకున్న పాఠశాలకు, తనకు బోధించే ఉపాధ్యాయుల వద్దనే పనిచేసే అరుదైన అవకాశం కలగడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఆ తర్వాత 1985లో బలిజిపేట మండలం చిలకలపల్లి ఎంపిపి స్కూల్‌కు, 1989 నవంబర్లో సొంత మండలం నీలకంఠాపురం (చిన్నయ్య వలస) ఎంపిపి స్కూల్‌కు బదిలీపై వచ్చాను. 2000లో పూనిబుచ్చంపేట ఎంపిపి స్కూల్ ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయునిగా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యింది. 2005లో మళ్లీ నీలకంఠాపురం( చిన్నయ్య వలస) బదిలీ కాగా మండల విద్యాశాఖ రిసోర్స్ పర్సన్‌గా విధులు నిర్వహించాను. అపార్డు శిక్షణ తీసుకుని జిల్లాలోని ఎంపిటిసి, సర్పంచులు, వార్డుసభ్యులకు, ప్రజాప్రతినిధులకు విధులు, నిధులపై అవగాహన కల్పించే శిక్షణను ఇవ్వడంలో మంచి గుర్తింపు పొందడం సంతోషం కలిగింది. 2007లో బెస్ట్ ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులుగా జిల్లా పరిషత్ చైర్మన్ చేతుల మీదగా జిల్లాస్థాయి అవార్డుతో ప్రశంసలు పొందాను. 2011లో సొంత గ్రామంలోని డిపెప్ స్కూల్‌కు బదిలీపై వచ్చాను. ఈ స్కూల్ ఆటస్థలం కొత్తగా ఉండడంతో స్థానికంగా యువత, ఉద్యోగులు, ప్రజల సహకారంతో రూ.లక్షా50 వేలతో స్థలం కొని ఆట స్థలాన్ని సమకూర్చాను. 2013లో సెకండ్ గ్రేడ్ ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతిపై మెరకముడుదాం జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయ్యింది. అక్కడి విద్యార్థుల నుంచి ఆదరణ పొందడం చాలా ఆనందాన్నిచ్చింది. ఇక్కడే పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించడంతో ట్రిబుల్ ఐటికి 16మంది విద్యార్థులు, ఎన్‌ఎంఎంఎస్‌కు 12మంది విద్యార్థులు అర్హత సాధించారు. 2017లో ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా జిల్లాస్థాయి అవార్డు కలెక్టర్ చేతుల మీదుగా అందుకోవడం, మెరకముడిదాం ప్రజలు పౌర సన్మానించడం సంతోషాన్ని ఇచ్చింది. 2018లో ఎఫ్ఎసి ఎంఇఒగా కూడా పనిచేశాను. 2021 మార్చి 20న సొంత మండలం స్వగ్రామమైన నిడగలు జిల్లా పరిషత్ హై స్కూల్‌కు ప్రధానోపాధ్యాయులుగా బదిలీపై వచ్చి నేడు విరమణ వరకు ఇక్కడే పని చేస్తున్నాను. ఎన్‌ఎంఎంఎస్‌కు 2022, 2023 లో ఇద్దరే చొప్పున విద్యార్థులు విద్యార్థులు అర్హత సాధించారు. ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించగా, 500 మార్కులు పైబడి22 మంది విద్యార్థులు సాధించారు. నాడు నేడు నిధులతో అదనపు తరగతి గదులు నిర్మించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణలో భాగంగా నా సొంత ఖర్చులతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించాను. ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షునిగానూ, ప్రస్తుతం జిల్లా గౌరవాధ్యక్షులు పనిచేస్తూ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేసే అవకాశం కలగడం ఆనందంగా ఉంది. నిడగల్లులో మైత్రీ ఫౌండేషన్ పెట్టి శ్మశాన వాటికి అభివృద్ధితో పాటు గ్రామస్తుల్లో ఎవరైనా మృతి చెందినా, ఎలాంటి ఇబ్బందులేకుండా దహన సంస్కారాలకు నిధులు ఖర్చు చేస్తున్నాం. నా భార్య అన్నపూర్ణమ్మ సహాయ సహకారాలతో పిల్లలను ఉన్నత చదువులు చదవించడంలో సఫలీకృతుడినయ్యాను. ఉద్యోగ విరమణ అనంతరం సేవా కార్యక్రమాలతో శేషజీవితం గడపాలని భావిస్తున్నాను.

# జయకృష్ణను కలిసిన కరుణాకర్

**ప్రజాశక్తి - పాలకొండ**

ఎమ్మెల్యేగా ఎన్నికైన నిమ్మక జయకృష్ణను పట్టణంలో ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద టిడిపి నాయకులు పాలవలన కరణాకర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గతంలో ఈయన ప్రజారాజ్యం పార్టీ జిల్లా అధ్యక్షునిగా పని చేశారు. ఆ పార్టీ విలీనం తర్వాత టిడిపిలో కొనసాగారు. 2014ఎన్నికల్లో ఆయన కొత్తూరు ఎమ్మెల్యే టికెట్ కూడా ఆశించారు. ఆయనకు పాతపట్నం నియోజకవర్గంలో కొత్తూరు, పాలకొండ నియోజకవర్గంలో వీరఘట్టం మండలాల్లో మంచి గుర్తింపు ఉంది.

# ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి - భామిని**

ఎన్నికల ద్వారా ఎన్నికైన విద్యార్థి నాయకులకు నాయకత్వ లక్షణాలు, ఇటువంటి ఎన్నికలు పాఠశాల నిర్వహించడం వల్ల ప్రజాస్వామ్యంలో నిర్వహించే ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. సాధారణ ఎన్నికలు లాగే విద్యార్థులకు గుర్తులు కేటాయించి, బ్యాలెట్ పత్రాలు అందజేసి, రహస్య పద్ధతిలో ఓటింగ్ వేసి, బ్యాలెట్ పత్రాలను బ్యాలెట్ బాక్స్‌ల్లో భద్రపరిచారు. పాఠశాలలోని 700 మంది విద్యార్థులు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. విజేతలను త్వరలోపకటిస్తామని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బి.ముత్యాలు, ఏ.నర్సయ్య, ఆర్.సంతోష్ కుమార్, కె.సూరి బాబు తెలిపారు.

### డబ్బులు అందలేదని రైతుల ఫిర్యాదుతో

# విత్తన కంపెనీల చెల్లింపులపై విచారణ

**ప్రజాశక్తి - పాచిపెంట**

2023 ఖరీఫ్ సీజన్లో పండించిన కావేరి కంపెనీ సీడ్ ప్రొడక్షన్‌కు సంబంధించిన డబ్బులు ఇంతవరకూ అందలేదని, కొంతమందికి మాత్రమే ఇచ్చి ఇంకా కొంతమందికే ఇవ్వలేదని విశ్వనాథపురం రైతులు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ అధికారి సూచనలతో సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.మధుసూదనరావు, ఎఇ కె.తిరుపతిరావు రైతుల సమక్షంలో శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా 32 మంది రైతులు సుమారు 104 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్లో కావేరి కంపెనీకి సంబంధించిన మొక్కజొన్న పండించారు. అయితే ఈ విత్తనాలకు నాటకపోవడంతో నష్టపరిహారం ఎకరాకు రూ.30 వేలు చొప్పున పరిహారం ఇస్తామని కావేరి కంపెనీకి చెందిన ఆర్గనైజర్ వేమూరి వంశీకృష్ణ ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో కొంతమంది రైతులకు మాత్రమే పరిహారం చెల్లించి, మిగిలిన వారికి చెల్లించలేదని రైతులు తెలిపారు. అలాగే 2023 రబీ సీజన్లో 8మంది రైతులకు సిపి కంపెనీకి చెందిన సుమారు రూ.2లక్షలు చెల్లించలేదన్నారు. ఈ విషయమై కంపెనీ ఆర్గనైజర్‌ను ప్రశ్నించగా అందరికీ జులై 3న చెల్లిస్తానని తెలిపారు. ఇప్పటి వరకు ఎందుకు చెల్లించలేదని రైతులు నిలదీశారు. ఈ సందర్భంగా ఎడి మధుసూదన్‌రావు మాట్లాడుతూ కంపెనీకి చెందిన విత్తనాలు వేసేటప్పుడు రైతు ఆర్‌బికెలకు తెలియజేయాలన్నారు. అలాగే కంపెనీ వాళ్లు కూడా ఏఏ విత్తనాలు ఎంతమంది రైతులకు ఏఏ గ్రామాల్లో సరఫరా చేస్తున్నారో ముందుగానే తెలియజేసినట్లయితే ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్త పడొచ్చన్నారు. రైతులతో ఒప్పంద పత్రాలను, బిల్లులను, రైతులకు ఇచ్చిన రసీదులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎ బోను మోహన్, రైతులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి : మాజీ ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - బలిజిపేట**

ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును పూర్తిగా స్వాగతిస్తూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త గ్రామ, మండల స్థాయి నాయకులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన శుక్రవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకూ ప్రజా సంక్షేమం, పథకాలు అందించడంలో ప్రజలకు చేరువులో ఉండడం గానీ, మండలంలోని దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించడంలో గానీ ఎటువంటి నిర్లక్ష్యం చూపలేదని అన్నారు. మండలంలో ఏయే గ్రామాల్లో మెజార్టీ తక్కువ వచ్చిందో అక్కడ నాయకులు ఎక్కువగా దృష్టి పెట్టాలన్నారు. అక్కడ జరిగిన తప్పులను సరిదిద్దుకోవడానికి ప్రయత్నించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రతి సర్పంచ్, కార్యకర్త నిరాశ చెందకూడదని ధైర్యంగా ఉండాలని అన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయడమే ధ్యేయగా పనిచేయాలని ఆయన వారిని కోరారు.

# అత్యాచార కేసులో నిందితుడికి పదేళ్లు జైలు

**ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్**

మండలంలోని అడ్డాపుశీలకు చెందిన పట్ల సింగ్ రాజేష్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడడంతో విజయనగరం జిల్లా మహిళా ప్రత్యేక న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.30వేలు జరిమాన విధించారు. విజయనగరానికి చెందిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీంద్రనాథ్ అందించిన వివరాల ప్రకారం 2020 మే 11న తనను అత్యాచారం చేశాడంటూ ముద్దాయిపై బాధితురాలు ఫిర్యాదు మేరకు అప్పటి సిఐ విజయానంద్, రూరల్ ఎస్సై సింహాచలం దర్యాప్తు జరిపి ముద్దాయిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ కేసుపై శుక్రవారం న్యాయమూర్తి పద్మావతి పై తీర్పునిచ్చినట్లు ఎపిపి తెలిపారు.

# పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు అడ్డుకట్ట

**ప్రజాశక్తి -భామిని**

వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులను అరికట్టాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి, దోమలు పెరగకుండా జాగ్రత్త వహించాలని గ్రామస్తులకు బత్తిలి పిహెచ్‌సి వైద్యులు కె.దామోదరరావు తెలిపారు. బత్తిలి పిహెచ్‌సి పరిధిలోని మనుమకొండలో వైద్య సిబ్బంది వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలోని నీటి సరఫరా ట్యాంకులు శుభ్రపరిచి, ట్యాంక్‌లోని నీటిని క్లోరినేషన్ చేశారు. సర్పంచ్ నిమ్మల కేశవ ఆధ్వర్యంలో కాలువలు, వీధుల్లో పారిశుధ్య పనులు నిర్వహించి, చెత్తను తొలిగించారు. మురుగు కాలువలు, నీటి కుళాయిల వద్ద దోమలు పెరగకుండా యాంటీ లార్వా స్ప్రే ద్రావణం పిచికారీ చేశారు. కార్యక్రమంలో బత్తిలి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల విద్య ప్రయివేటుపరం కావద్దు

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

పాఠశాల విద్య ప్రైవేటుపరం కావడానికి ప్రభుత్వ నిర్ణయాలు దోహదపడుతున్నాయని, వీటిని కొత్త ప్రభుత్వం సరిచేయాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ కోరారు. గుమ్మలక్ష్మీపురంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు అమ్మఒడి పథకాన్ని వర్తింపచేయడం, వేలాది గ్రామాల్లో 3, 4, 5 తరగతులు అందుబాటులో లేకపోవడం... ఇవన్నీ తల్లిదండ్రుల దృష్టి ప్రైవేటు పాఠశాలల వైపు మరలేలా చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్బంధంగా అమలు చేస్తున్న అనవసరమైన యాప్‌ల వల్ల విద్యా బోధన కంటే బోధనేతర కార్యక్రమాల అమలు ప్రధానమని తల్లిదండ్రులు అంచనాకు వచ్చారని అన్నారు. రాష్ట్రంలో ఇతర భాషలైన ఉర్దూ, కన్నడ, ఒరియా మీడియం పాఠశాలలు ఉన్నాయి కానీ నేడు తెలుగు బోధనా భాషగా లేని దౌర్భాగ్యం కొనసాగుతుందని వాపోయారు. 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయాలనే నిర్ణయంతో జారీ చేసిన జిఒ 117 కారణంగా రాష్ట్రంలో ఒకటి రెండు జిల్లాలు మినహా అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయ పోస్టులు అదనంగా ఉన్నట్లు తేలిందన్నారు. దాదాపు 25 వేలకు పైగా పోస్టులు రద్దు అయ్యే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. జాతీయ విద్యా విధానానికి భిన్నంగా చేపట్టిన విలీన ప్రక్రియ, హేతుబద్ధీకరణ ప్రక్రియల అంతిమ లక్ష్యం ఉపాధ్యాయ పోస్టుల రద్దు అనేది స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా ఉపాధ్యాయ పోస్టులను తగ్గించడం, రద్దు చేయడం ద్వారా విద్యా ప్రమాణాలు, నాణ్యత ఎలా పెరుగుతాయని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు దుర్గారావు, మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మోహనరావు, బంటు సింహాచలం పాల్గొన్నారు.

# ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

**ప్రజాశక్తి - కురుపాం**

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి, అన్ని ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని స్థానిక ఎస్సై షణ్ముఖరావు అన్నారు. శుక్రవారం గాంధీనగర్ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహించి ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ధ్రువీకరణ పత్రాల్లేని వాహనదారులకు అపరాధ రుసుం వేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి వాహనాలు నడపాలని సూచించారు. లేకుంటే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వాహనదారులకు సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై అవగాహన సదస్సు

**ప్రజాశక్తి-సీతానగరం**

పారిశుధ్యంపై పెదబోగిలి గ్రామ సచివాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి పి. పావని మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం లోపం లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీల పిల్లలకు అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, పెద బోగిలి పంచాయతీ ఇఒ జి.వెంకట్రావు, సిహెచ్ఒ ఎస్. రమణ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు

**ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం**

ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన సందర్భంగా ఆమెకు అభినందనలు తెలిపారు. విశ్వ బ్రాహ్మణులకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, ఈ ప్రభుత్వంలోనైనా తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా అధ్యక్షులు కె.గౌరీశ్వరరావు కోరారు.కార్యక్రమంలో ఐదు మండలాల అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.